# "సద్యఃపుణుకులు"

కొండూరి నరసింహం

అవసరమైనంత తీరిక ఉండి —హామాషీగా— బజారువైపు కాలుసాగిస్తే, మిరాయి దుకాణాలు, కాఫీహోటళ్లు కమ్మనివాసనలుపంచిపెడుతూంటాయి. కాని ఆ వాసనలు మనముక్కుల దాకా చేరనివ్వకుండా, రోడ్డుదుమ్ము, సైకుకాల వల కుళ్లుకంపూ శక్తికొద్దీ ప్రయత్నిస్తూ ఉంటాయి. రేడియోలరొద చెవుల నదరగొట్టడంతో ముక్కులుపనిచేయకపోవడమనే ప్రమాదంకూడా తటస్థించవచ్చుఅంటే అతిశయోక్తి కాదు. ఇదంతా దేనికుపోద్ఘాతమంటే మారోడ్డుమకుపులో చెట్టుక్రింద "సద్యఃపుణుకులు"అమ్మే రత్తమ్మత్త కొట్టుగురించి పరిచయం చేయడానికే.

తలకు తగులుతున్న చూరు, ఒరిగిప్రేలాడే అరుగు తడికెలు, పొగలుచిమ్మే పొయ్యి, గాలికి రాలుతున్న ఆకులు, ఎగిరివచ్చే దుమ్ము వగైరా వగైరా దుష్టదృశ్యవిశేషాలేమీ రత్తమ్మత్త అమ్మకాలకేమీ అడ్డురావు. రేడియో, మయపుకుర్చీలు, మకిలిసర్వేయలు, ఓవల్టిన్ కాఫీలు ఇత్యాదుల అవసరమేమీలేకుండా మూడుపావలాలపెట్టుబడితో దినదినమూ మూడురూపాయలలాభమైనాచూచే రత్తమ్మ ఆంధ్రప్రతిభకనువైన ప్రతిబింబమని మనస్సులోనే ఎన్నోరోజులు మెచ్చుకున్నాను. పచ్చగడ్డిపిల్ల బాలిది కట్టెలుకొట్టే రంగయ్య, మిల్లు కూలీ మాంకాళి ప్రభృతులు రత్తమ్మకు శాశ్వత పోషకుల జాబితాలోవాళ్లు. ఒక్కొక్కరే పొయ్యిచుట్టూ చేరి వేసిన వాయను వేసినట్లే మాయంచేసేమాత్రమూర్తులు. ఊరికేవచ్చినబాధ మాకులపళ్లాలలో వాళ్లు లోకపు రుచులనన్నిటిని ఒక్కసారిగా అనుభవించే దేవతామూర్తులలాగ వారానందపడుతూ తింటూంటే చూచే నవనాగరికుల కత్యాశ్చర్యమేయక మానుతుందా? నష్టంలేకుండా కాఫీహోటలు నడపడం ఆంధ్రులకు చేతకాదని ఆక్షేపించే నిక్షేపరాయుళ్లెవరైనాఉంటే రత్తమ్మ దుకాణాన్ని ఉదహరిస్తే ఊపిరి బిగపట్టేస్తారు. ఈ దుకాణాన్ని కాఫీహోటలని లోకం అనకపోతుందేమో అన్న అనుమానం రత్తమ్మకు ఎందుకు కలిగిందో టీ కలపడం నేర్చుకుంది. డికాషను ముందేతీసి ఒక కడవలోపెట్టి ఉంచి (బెల్లపుపాకం అందులో బట్టీ అయిఉంటుంది) రెండు చెంచాలపాలతో అరకప్పు అమృతపు టీ అత్యవసరమన్న వాళ్ళకందిస్తూంటుంది. ఇంకేం కావాలి. ఆమె చేతిలో ఏమి మహాత్యమున్నదో ఆ వేడిపుణుకులు మధురాతిమధురమై రుచి నిస్తాయి.

చూచిచూచి ఉండబట్టలేక నేనూ ప్రచ్ఛన్నంగా వెళ్ళి ఆ పుణుకులను విచారించి, విమర్శించి, అద్భుతమైన అనుభూతినిపొంది చక్కావచ్చాను. ఆ పుణుకులు విచిత్రతత్వంతో వివిధ వ్యాఖ్యానాల కనుగుణంగా ఉంటాయి. ఒకరోజున ఇద్దరు వైద్యరాజులు సర్వరోగనివారిణియైన ఔషధ మేదియన్న చర్చలో ముఖాలు చెంద్రుకుంటున్నారు. నేను కలుగజేసికొని "రత్తమ్మ పుణుకులువేసే మూకుడులోని నూని గోరువెచ్చగా ఉండగా ఒకఔన్సు దాహముచ్చుకుంటే సర్వరోగాలూ నశిస్తాయని చెప్పాను. అదేమిటన్నట్టు వారు ప్రశ్నార్థకపు మొఖాలు ప్రదర్శించారు. రత్తమ్మ కొట్టుపెట్టి పదిహేనేండ్లు కావస్తోంది. మొదటిరోజున మూకుడులోపోసిన నూనెబాపతు శేషం నేటికీ బ్రాటోవరవుతూనే ఉంటుంది. కాబట్టి దానికి వచ్చినన్ని బట్టీలు మా వసంత కుసుమాకరాదులకు రావుకదా అదీ ప్రశస్తి అన్నాను. అది వారికర్థంకాక చరకం శుశ్రుతం తిరగేయడం మొదలెట్టారు. మనస్సుకు పరిణామస్థితులు వివిధ రకాలుగా ఉన్నట్టుగానే సద్యః పుణుకుల స్వభావంలో కూడా రకరకాల అంతస్థులున్నాయి. తత్కాలమందే మూకుడులోనుండి బైటకు తీయబడినవి ఆవేశోద్వేగాలు చూపే ఆంధ్రులను స్పృహకుతెస్తాయి. సమయం గడిచి చల్లారితే మద్రాసు మాదే అనే అరవసోదరులఅస్తిత్వాన్ని జ్ఞాపకంచేస్తాయి. ఆత్మకు వినాశ పరిమాణ పరిమితులు లేవనే వేదాంతార్థం పుణుకుల స్వరూప

మునకే అనువర్తించడమిక్కడ విచిత్రం. 15 ఏండ్ల సర్వీసులోనూ రత్తమ్మత్త చేతిలో ఒక పుణుకు చిక్కినట్లుండడం, ఒక పుణుకు బలిసిపోవడం అనేదిమాత్రంలేదు. భూకంప ప్రదోషాదులచే భూగోళ స్వరూపం మారడానికవకాశం ఉందికాని పుణుకుల రూపం రత్తమ్మచేతిలో అసంభవం. అనూహ్యం. వాని నారగించే నాయకులకు ప్రపంచమే ఒక పుణుకుగా కనిపించడం వింతగాదు.

పత్రికలలో "బడ్జెటులో రెండున్నర కోట్ల కొరత. ఇక ఆహారం దేశంలో రెండు మాసములకు చాలినది ఉంది. రామపాదసాగరుని గురించి పునర్విమర్శ గాంధీగారి విగ్రహాన్ని ప్రధాన మంత్రులు ప్రతిభాపార్కులో ఆవిష్కరించారు. మృగముల సంరక్షణమునకై కేంద్రమొక సంఘాన్ని నియమించింది. నాయకులలో తగిన సామరస్యమేర్పడిన ఆంధ్రరాష్ట్రానికి కేంద్రమడ్డు రాదని నెహ్రూ వివరణ" వంటి వార్తలన్నీ ఎప్పుడు చల్లారిపోయి కొరకరాని కొయ్యలుగా తయారైన పుణుకులులా కనిపిస్తాయి. రాజాజీ ఫలోక్తులు, తెలుగు నాయకుల సమావేశాలు, విద్యార్థుల సమ్మెలు, రాష్ట్రావతరనకు చేయబడే యత్నముల వివిరాలు, కమ్యూనిస్టుల గాలికబుర్లు వగైరాలు సద్యఃపుణుకులకు సాటివస్తాయి. సంపాదకులప్పుడప్పుడు విసిరే కలం విసుర్లలో సద్యఃపుణుకుల నిజతత్వం ప్రతిబింబిస్తుంది. చూడండి గడచినవారం "తెలుగుస్వతంత్ర" సంపాదకీయం "ఆంధ్రదేశనాయకుల అవివేకమే తమిళుల వివేకం"అన్న పేరా అంతా చదివారా? ఈ నిర్వచనం సద్యఃపుణుకుల భక్తుల శరీరాల మీద విపరీతంగా ధ్వనిస్తుంది. కేంద్రంనుంచి వినబడే వార్తావివరాలు చల్లబడిన పుణుకులులా ఉంటే రాజాజీవారనే రత్తమ్మత్తగారు సద్యఃపుణుకులుగా వానిని వ్యాఖ్యానిస్తారు. అదీ తమాషా. పేచీతోగూడిన మద్రాసువిషయంలో ఆంధ్రులు పట్టుబడితే అన్యాయం. అనేక తరగతులవారు నివసించే మద్రాసుసమస్యను బాధ్యతాశూన్యంగా పెద్దమనుష్యుల పరిష్కారానికి కేంద్రం ఎన్నడూ ఒప్పుకోదని నెహ్రూగారి అరుపు. చూచారా! మద్రాసు అరవలకు వదులుకుంటే ఆంధ్రరాష్ట్రమీయడానికి కేంద్రానికభ్యంతరంలేదట అంటూ ఆచార్యులవారివిరుపు. ఇందులో మన పుణుకు తత్వం లేదంటారా? ఆంధ్రులమధ్య పర్యటించేటప్పుడు "సద్యఃపుణుకు"గా రుచియిచ్చిన నాయకమ్మన్యుడు ఢిల్లీ వెళ్ళగానే పురాతనపు పుణుకైపోతాడు. ఇందులో రహస్యమేమిటంటారు? ఎన్నికలకు పూర్వపు మంత్రులంతా సద్యఃపుణుకులుగానే ఉండేవారు. వానికి వ్యతిరేకపు రూపధారులయారిప్పటి మంత్రులు. విచిత్రంకదూ.

నాల్గురోజులు సమ్మెలు జరిపి, రైళ్ళాపి, హర్తాళ్ జరిపించిన ఆంధ్రుల రాష్ట్రవాంఛ వారం తిరగకుండానే పుణుకు తత్వానికి పరాయింపయింది కారణము ఏమిటి? డెమొక్రెటిక్ ఫ్రంటుతో చేతులు కలిసినప్పుడు ప్రకాశం పంతులుగారు సద్యంః పుణుకుగానే భాసించాడు. విస్తరించి బైటపడ్డప్పుడూ అలానే ప్రకాశించారు. అసలువారి తత్వమే అంతా? సద్యఃపుణుకుగా చాలామంది నోటబడ్డ కళాప్రభృతులు అడుగుజంగిడీలోపడిఅదృశ్యమయారే. ఆయావ్యక్తుల దేశీయరాజకీయ సిద్ధాంతాలేమిటంటారు? సద్యఃపుణుకుగానుగాక చల్లారిపోయిన పుణుకుగాక అవ్యక్తావతారధారులైన రంగాగారు రాష్ట్ర విషయమేమీ వాక్రుచ్చరేమి? దంపుడు బియ్యపు ప్రచారం, వేదాల తెనిగింపు వ్యాపారం, రాష్ట్ర సంపాదనా దుమారంలేపిన స్వామిసీతారాంగారు సద్యఃపుణుకంటారా? మరేమైనా సందేహమున్నదా? అఖిలాంధ్ర పరిషత్తు భంగమైపోయి, విశాలాంధ్ర పరిషత్తు బెజవాడలో ముగింపయేలోపున మన దేశసేవకులలో సద్యఃపుణుకు లెంతమందో అంకె తేలిపోతుంది. విశాలాంధ్ర పరిషత్తుకు కమ్యూనిస్టులు హాజరుకారాదనే బారాహుకుమే ఈ సద్యఃపుణుకుల నూనెలో ఉండే వాలాజీ (బాలాజీ అంటారు మిత్రులు కొందరు) తత్వాన్ని రూపిస్తోంది.

ఏమైనా అనుభవశ్రీలు కొందరు సద్యఃపుణుకులమీద ఒక విశాల విమర్శనా, కావ్యాన్ని వ్రాయడం అత్యవసరమని అనుకుంటాం. ఆంధ్రులు కచటతపలన్నారు కామేశ్వరరావుగారు. అంతకంటే అర్థమయేటట్టు "సద్యఃపణుకులు" అంటేనే బాగుంటుందేమో...